సమస్యల పరిష్కారానికే లోక్ అదాలత్

జాతీయ లోక్ అదాలత్‌లో ఖమ్మం జిల్లా జడ్జి రాజగోపాల్

లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్, సెప్టెంబర్ 28 : సమస్యల పరిష్కారానికి సరైన వేదిక లోక్ అదాలత్ అని ఖమ్మం జిల్లా జడ్జి వి.రాజగోపాల్ అన్నారు. ఖమ్మంలోని న్యాయ సేవాసదన్‌లో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కొన్నేళ్లుగా జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నామని, వీటికి ప్రతిసారి విశేష స్పందన వస్తుందన్నారు. రెగ్యులర్ కోర్టు విధానంలో ఒక కోర్టులో తీర్పు వచ్చినట్లయితే ఒక పక్షం వాళ్లు గెలిచి.. మరోపక్షం వాళ్లు ఓడిపోతారని, అయితే లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాలు గెలుపొందే అవకాశం ఉంటుందన్నారు. దీంతో కక్షిదారుల్లో సుహృద్భావ వాతావరణం పెంపొందుతుందన్నారు. మంచి మనస్సుతో ప్రయత్నిస్తే పరిష్కారం లేని సమస్య అంటూ లేదని, ఏదైనా కోర్టుకు వచ్చే వివాదాల అంతిమ పరిష్కారం లోక్ అదాలత్ ద్వారానే అని పునరుద్ఘాటించారు. ఇటీవల కాలంలో ఖమ్మం జిల్లా వర్షాలు, వరదలతో సతమతమైందని, అయినప్పటికీ కక్షిదారులు ఉత్సాహంతో లోక్ అదాలత్ ప్రక్రియలో పాల్గొనడం పట్ల ఆయన అభినందించారు. లోక్ అదాలత్‌లకు సహకరించిన న్యాయవాదులు, పోలీసులు, బీమా కంపెనీ ప్రతినిధులు తదితరులను న్యాయమూర్తి అభినందించారు. అనంతరం రాజీమార్గంలో పరిష్కారమైన మూడు కేసులలో కక్షిదారులను అభినందించి.. వారికి పూల మొక్కలు, లోక్ అదాలత్ అవార్డును అందజేశారు.

10,820 కేసుల పరిష్కారం..

జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ఆధ్వర్యంలో మొత్తం 10,820 కేసులను పరిష్కరించారు. ఇందులో 91 వాహన ప్రమాద కేసుల పరిష్కరించి, బాధితులకు రూ.4.52 కోట్ల పరిహారం అందజేశారు. మోటరు వాహన ప్రమాద కేసుల బెంచ్‌కి అదనపు జిల్లా జడ్జి ఎం.అర్చనకుమారి అధ్యక్షత వహించగా.. ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కేవీ చంద్రశేఖరరావు ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.కల్పన పెండింగ్ సివిల్ కేసులను పరిష్కరించారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి క్రిమినల్ కేసులు, బ్యాంకు కేసులను పరిష్కరించారు. న్యాయమూర్తులు బి.రజని, వై.బిందుప్రియ, వి.మాధవి, శాంతిలత ఆయా కోర్టుల లోక్ అదాలత్ బెంచ్‌లలో క్రిమినల్ కేసులను పరిష్కరించారు.

రాజీయే రాజమార్గం

- లోక్ అదాలత్‌లో 4,313 కేసులు పరిష్కారం
- భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్


బాధితులకు నష్టపరిహారం చెక్కు అందజేస్తున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 28 : క్షణికావేశంలో చేసిన తప్పిదాల వల్ల కోర్టుల చూట్టూ తిరగాల్సి వస్తుందని, ఇందుకు రాజీయే రాజమార్గమని భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ క్రిమినల్ కేసులు 2,462, మోటర్ యాక్సిడెంట్ కేసులు 26 కాగా.. రూ.1,46,95,000 రికవరీ చేసినట్లు తెలిపారు. బ్యాంకు రికవరీ కేసులు 77, సైబర్ క్రైం కేసులు 42 కలిపి మొత్తం 4,313 కేసులు పరిష్కారమైనట్లు చెప్పారు. అనంతరం రూ.73,14,871 చెక్కును ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ పంజాగుట్ట బ్రాంచి డిప్యూటీ మేనేజర్ మోహన నుంచి ప్రమాదంలో చనిపోయిన త్రీ ఇంక్లైన్ తండాకు చెందిన బానోతు రవికుమార్ భార్య వినోద, పిల్లలకు జడ్జి అందజేశారు. ఎస్‌బీఐ కొత్తగూడెం సౌజన్యంతో కక్షిదారులకు ఏర్పాటు చేసి పులిహోర, మంచినీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి, మెజిస్ట్రేట్‌లు రామారావు, సాయిశ్రీ, శివనాయక్, ఖమ్మం నుంచి బీమా న్యాయవాదులు కొత్తపల్లి రామారావు, గురజాల సీతారామారావు, శెట్టిపల్లి వెంకటరామారావు, అంబటి రమేశ్, న్యాయవాదులు, బ్యాంకు మేనేజర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.4.50 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మాణం

బస్తీ రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 28 : కొత్తగూడెం–పాల్వంచ పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.4.50 కోట్ల వ్యయంతో రింగ్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు లభించినట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం పట్టణంలోని 3, 4, 23, 32, 33, 34 వార్డుల్లో రూ.4.50 కోట్ల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ, బీటీ రోడ్లు, పార్కుల అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగూడెం ఉమెన్స్ కాలేజీ నుంచి పాత కొత్తగూడెం మీదుగా బైపాస్ రోడ్డు వరకు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించే బీటీ రోడ్డుతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. రూ.9.20 కోట్ల వ్యయంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలు, పరిసర ప్రాంతాలను కలుపుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించిందన్నారు. వరంగల్, ఖమ్మం, హైదరాబాద్ తరహాలో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను మహా నగరాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్ స్వామి, తహసీల్దార్ పుల్లయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ రవికుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'సర్దుబాటు' ఉత్తర్వులను సవరించాలి

నల్లబ్యాడ్జీలతో ఏటీఏ బాధ్యుల నిరసన

నల్లబ్యాడ్జీలతో పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఏటీఏ బాధ్యులు

దుమ్ముగూడెం, సెప్టెంబర్ 28 : ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణపై ఇటీవల తెలంగాణ విద్యాశాఖ జారీ చేసిన ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25 ఉత్తర్వులను వెంటనే సవరించాలని డిమాండ్ చేస్తూ జాక్టో(జాయింట్ యాక్షన్ కమిటీ టీచర్స్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో మారాయిగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కో–చైర్మన్, ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు మాట్లాడుతూ హేతుబద్ధీకరణపై విద్యాశాఖ జారీ చేసిన జీవో 25 శాస్త్రీయంగా లేదని, 11 నుంచి 60 మంది వరకు విద్యార్థులకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులే బోధించడం పరోక్షంగా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడమే అవుతుందన్నారు. వెంటనే దీనిని సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర కోశాధికారి సోయం హన్మంతరావు, మండల అధ్యక్షుడు వాసం ఆదినారాయణ, పూసం రమేశ్, సోడి సత్యప్రసాద్, తుర్రం నర్సింహారావు, రామకృష్ణ, సీతయ్య, హిందులత, బాలరాజు, రాంబాబు, కాంతారావు పాల్గొన్నారు.

ఎకో బ్రిక్స్ తయారు చేయండి

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్, స్వచ్ఛ హీ సేవా–2024 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పంచాయతీల్లో కార్యదర్శులు ఎకో బ్రిక్స్ తయారీ చేపట్టాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు తమ మండలాల్లోని పంచాయతీల్లో ఈ నెల 30వ తేదీ లోపు ఎక్కువ మొత్తంలో ఎకో బ్రిక్స్ తయారు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కువ మొత్తంలో ఎకో బ్రిక్స్ తయారు చేసిన గ్రామ పంచాయతీలను మండల స్థాయి టీమ్ సభ్యులైన ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో, ఏపీఎంలు ధ్రువీకరించి ఫొటోలతో డీఆర్‌డీవో కార్యాలయానికి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని పేర్కొన్నారు. ఎక్కువగా తయారు చేసిన కార్యదర్శులను జిల్లాస్థాయిలో ప్రాధాన్యతా క్రమంలో మొదటి పది స్థానాల్లో సన్మానించి, జ్ఞాపికలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

డేంజర్ పార్సిల్స్!

- నిషేధిత మందులు.. ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం
- దూర ప్రాంతాల నుంచి పోస్టల్ ద్వారానూ సరఫరా
- పార్సిల్ ఓపెన్ అయితే ప్రమాదమే..
- అధికారులు నిఘా పెట్టకపోతే తప్పదు భారీ మూల్యం

పోస్టల్ శాఖ ద్వారా వచ్చిన గడ్డిమందు డబ్బాల పార్సిళ్లు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : ఆ మందు తాకినా వాసన చూసినా చాలా డేంజర్. గడ్డి నివారణ కోసం కొట్టే ఆ మందు పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని ప్రభుత్వమే ఆ గడ్డిమందును నిషేధించింది. ఇంతకీ ఆ మందు పేరు గ్లైఫోసెట్. ప్రస్తుతం పురుగు మందుల డీలర్ల వద్ద ఈ మందు దొరకదు. కానీ.. రైతులు మాత్రం గ్రామాల్లో పంటలపై దర్జాగా వినియోగిస్తున్నారు. ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతాల్లో రైతుల వద్ద తరచూ ఈ మందు కనబడుతున్నది. కూలీల కొరత కారణంగా కలుపును నివారించడానికి రైతులకు గడ్డిమందే శరణ్యం. అయితే నిషేధిత మందులను దొడ్డిదారిలో పోస్టల్, ఆన్‌లైన్ సర్వీసుల ద్వారా కంపెనీల నుంచి నేరుగా తెప్పించుకుంటున్నారు.

ఆన్‌లైన్ ద్వారా సరఫరా..

ద్రవ పదార్థాలు పార్సిల్ ద్వారా రావాలంటే పోస్టల్ శాఖలో అనుమతి లేదు. అదేవిధంగా ఆన్‌లైన్ ద్వారా కూడా అనుమతి లేకపోయినా గుట్టుచప్పుడు కాకుండా సిబ్బంది కళ్లు గప్పి అట్టపెట్టెల్లో పార్సిల్ చేసి సరఫరా చేస్తున్నారు. తెలియని సంబంధిత ఆన్‌లైన్ సిబ్బంది ఎలాంటి పార్సిల్ వచ్చినా డెలివరీ చేయడానికి వెనుకాడడం లేదు. ఒక్కోసారి వాసన పసిగట్టినా మనకెందుకులే అని నోరు మూసుకుంటున్నారు. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి నేరుగా కంపెనీల నుంచి ఇలాంటి పార్సిళ్లు ప్రత్యక్షమవుతున్నట్లు తెలుస్తుంది. ఇటీవల భద్రాచలం డివిజన్‌లో పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా పార్సిల్‌లో వచ్చినట్లు రైతులే చెప్పడం గమనార్హం.

పార్సిల్ ఓపెన్ అయితే ప్రమాదమే..

బస్సులు, ఇతర రవాణా సాధనాల్లో వచ్చే ఈ గడ్డిమందు కొంచెం ఓపెన్ అయినా ప్రమాదం కొనితెచ్చుకోవాల్సిందే. ఈ మందు పార్సిల్ కొంచెం లీకు అయినా బస్సులో ప్రయాణికులకు ఎలర్జీతోపాటు కండ్లు తిరిగి పడిపోయే అవకాశాలు లేకపోలేదు. ఇలాంటి మందుల రవాణాపై అధికారులు నిఘా పెట్టకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదు. గంజాయి వంటి డ్రగ్స్ కూడా ఈ మార్గంలో రవాణా అయ్యే అవకాశాలు లేకపోలేదు. సంబంధిత అధికారులు నిఘా పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిఘా పెడతాం..

దూరప్రాంతాల నుంచి వస్తే మేము నియంత్రించడం కొంచెం కష్టమే అవుతుంది. మా జిల్లా నుంచి అలాంటి పార్సిల్స్ రాకుండా చూస్తున్నాం. రావు కూడా. బయటి నుంచి వచ్చే వాటిపై నిఘా పెడతాం. ద్రవ పదార్థాలు పార్సిల్‌లో రాకూడదు. డివిజన్ మీటింగ్‌లు పెట్టినప్పుడు అందరికీ తెలియజేస్తాం.

– వీరభద్రస్వామి, పోస్టల్ సూపరింటెండెంట్

ఆన్‌లైన్‌లో వస్తే ఏం చేయలేం..

నిషేధించిన మందును మన జిల్లాలో ఎవరూ తీసుకురావడం లేదు. ఆన్‌లైన్‌లో వస్తే మనం ఏమీ చేయలేం. పంటలు ఉన్నచోట ఆ మందులను వాడకూడదు. అందరికీ తెలుసు. ఆయిల్‌ఫాం ఉన్నచోట వాడుకోవచ్చు. రైతులు తమ అవసరాన్ని స్థానిక ఏవోకి తెలియజేస్తే ఆహార పంటలు లేనిచోట ఇచ్చే అవకాశాలు ఉంటాయి. డీలర్ల వద్ద మాత్రం అలాంటి మందులు లేవు. పక్కాగా తనిఖీలు చేస్తున్నాం.

– బాబూరావు, డీఏవో, భద్రాద్రి కొత్తగూడెం

అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- డీసీసీబీ వాటా ధనం రూ.7 కోట్లకు పెరుగుదల
- మహాజన సభలో చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు
- అరకొర రుణమాఫీతో అవస్థలు పడుతున్నాం : సొసైటీ చైర్మన్ల ఆవేదన

మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 28 : ప్రతి సొసైటీ పరపతేతర వ్యాపారాలు చేసి మంచి లాభాలు గడించే విధంగా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని డీసీసీబీ సమావేశ మందిరంలో 125వ మహాజన సభ చైర్మన్ అధ్యక్షతన శనివారం జరిగింది. తొలుత ఆరు నెలలుగా బ్యాంకు సాధించిన పురోగతి, రాబోయే రోజుల్లో సొసైటీలు, బ్రాంచీల అభివృద్ధికి తీసుకోనున్న చర్యలు, పంట, బంగారు రుణాలు తదితర అంశాలపై ప్రగతి నివేదికను సీఈవో వసంతరావు ప్రజెంటేషన్ చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ నాలుగు జిల్లాల పరిధిలోని 100 సొసైటీలను ప్రగతి పథంలో నిలపాలన్నదే పాలకవర్గం ప్రత్యేక లక్ష్యమని, అందుకోసం కొద్ది నెలల నుంచి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీసీసీబీ చేపట్టిన చర్యల ఫలితంగా గత ఏడాదితో పోల్చితే రూ.7 కోట్లు బ్యాంకు వాటాధనం పెరిగిందన్నారు. గత ఏడాది డీసీసీబీ వాటా ధనం రూ.137.95 కోట్లు కాగా.. ప్రస్తుతం రూ.144.97 కోట్లకు చేర్చామన్నారు. బ్యాంకు అధికారులు, ఉద్యోగుల కృషి ఫలితంగానే డిపాజిట్లు రూ.1,144 కోట్లకు తీసుకొచ్చామన్నారు. డీసీసీబీ ఆధ్వర్యంలో మొత్తం రూ.987.14 కోట్లు వానకాలం పంట రుణాలు ఇచ్చామని తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన పలు సొసైటీ చైర్మన్లు, సీఈవోలను సత్కరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, డీసీవో గంగాధర్, డీసీసీబీ పాలకవర్గ సభ్యులు, మార్క్‌ఫెడ్ ఉమ్మడి జిల్లా మేనేజర్ సునీత, వ్యవసాయ శాఖ కార్యాలయ ఏడీఏ వాణి, సొసైటీల చైర్మన్లు పాల్గొన్నారు.

అరకొర రుణమాఫీతో అవస్థలు..

తమ సొసైటీలలో సగానికి సగం సభ్యులకు కూడా పంట రుణమాఫీ వర్తించలేదని, దీంతో రైతుల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సొసైటీ చైర్మన్లు మొరపెట్టుకున్నారు. డీసీసీబీ పరిధిలో మొత్తం రూ.1.69 లక్షల మంది పంట రుణమాఫీకి అర్హత ఉండగా.. ఇప్పటివరకు కేవలం 60 వేల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించిందని, దీంతో మిగిలిన రైతుల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నామని సొసైటీ చైర్మన్లు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బాగం హేమంతరావు, మందడపు సుధాకర్, రాజయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.20 లక్షల పైబడి పంట రుణాలు కలిగిన రైతులకు ప్రభుత్వం తక్షణమే రూ.2 లక్షలు జమ చేసే విధంగా తీర్మానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బీమా గడువు దాటి పక్షం రోజులు కావొస్తున్నా తిరిగి పునరుద్ధరించలేదని, దీంతో ఇటీవల చనిపోయిన రైతులకు ఎవరు పరిహారం చెల్లిస్తారని వారు ప్రశ్నించారు. డీసీసీబీ లాభాలను బ్యాంకు ఉద్యోగులతోపాటు సొసైటీ సిబ్బందికి సైతం వర్తింపజేయాలని, సొసైటీలకు దీర్ఘకాలిక రుణాలు, బంగారంపై రుణాలు ఇచ్చే విధంగా వెసులుబాటు కల్పించాలని వారు కోరారు. ఎన్‌పీఏ బకాయిల పట్ల పాలకవర్గం తీసుకుంటున్న చర్యల గురించి సొసైటీ చైర్మన్లకు వివరించాలని వారు డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 28 : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై మానవుల కారణంగా అనేక రకాల జాతులు అంతరించిపోతున్నాయని అన్నారు. డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ లాంగ్వేజ్ కోర్సులు శిక్షణ అందించేందుకు అదనపు కంప్యూటర్, ప్రాజెక్టర్, ఆడిటోరియంలో చైర్, ఆడియో సిస్టమ్ మొదలగు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. హాస్టల్‌లో భోజనం, వసతి బాగా లేదని ఎస్సీ హాస్టల్ విద్యార్థినులు తెలుపగా, వాటిని పరిష్కరిస్తామన్నారు. నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే విద్యార్థినులకు అందించాలన్నారు. తెలుగు సాహిత్యవేత్త గుర్రం జాషువా జయంతి సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వేడుకలో కలెక్టర్ పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంను పరిశీలించి, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని ప్రిన్సిపాల్‌కు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

యువత వైఫల్య భయం వదిలివేయాలి

యువత జీవితంలో ఎదురయ్యే వైఫల్యాల పట్ల భయాన్ని వదిలి ముందుకుసాగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో పాల్గొన్నారు. 18 కంపెనీలు, 1,500 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి కలెక్టర్ ఆఫర్ లెటర్లను అందించారు. యువత పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ దిశగా కృషి చేయాలన్నారు. పోటీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రీజినల్ ఉపాధి అధికారి రవీందర్, జిల్లా ఉపాధి అధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు ప్రణాళికాబద్ధంగా చర్యలు

– అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 28 : పత్తిపంటను మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టినట్లు అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వానకాలం పత్తి సీజన్ కొనుగోలు యాక్షన్ ప్లాన్‌ను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వానకాలం సీజన్‌లో 1,99,730 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి వస్తుందన్నారు. పత్తి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు జిల్లాలో ఐదు సీసీఐ కేంద్రాలతోపాటు, మరో పది జిన్నింగ్ మిల్లుల వద్ద కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పొడవు పింజ రకానికి క్వింటాల్ రూ.7,251 మద్దతు ధర ప్రకటించామని, వచ్చేనెల 2వారం నుంచి పత్తిపంట కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు. మౌలిక వసతుల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు తేమశాతం 8–12శాతం ఉండే విధంగా చూసుకొని కేంద్రాలకు తీసుకరావాలన్నారు. సమావేశంలో డీఎంవో ఎంఏ అలీం, డీఏవో పుల్లయ్య, లీగల్ మెట్రాలజీ అధికారి విజయ్‌బాబు, ఫైర్ ఆఫీసర్ బీ అజయ్‌కుమార్, విద్యుత్‌శాఖ అధికారి సతీష్, ఖమ్మం ఏఎంసీ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, మోహిసున్ సుల్తానా పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల నిరసన

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 28 : అసంబద్ధ రేషనలైజేషన్ ఉత్తర్వులను ఉపసంహరించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను రద్దు చేయాలని, బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన తెలిపారు. ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, 30 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. నిరసన ప్రదర్శన అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని ఏవోకి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు నాగిరెడ్డి, నాగేశ్వరరావు, విజయ్, నాగేశ్వరరావు, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ డీఎస్సీ అభ్యర్థుల జాబితాను ప్రకటించాలి

న్యాయం చేయాలని నిరసన తెలుపుతున్న డీఎస్సీ 2008 అభ్యర్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 28 : డీఎస్సీ–2008 భర్తీ ప్రక్రియలో ఐటీడీఏ ఏజెన్సీ భద్రాచలం జాబితాను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శనివారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఐటీడీఏ పరిధిలో 67మంది అభ్యర్థులం ఎంపికైనా తాజాగా ప్రకటించిన జాబితాలో తమ పేర్లు లేవని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే జాబితాను ప్రకటించాలని, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో పాల్గొనేలా ఉత్తర్వులు ఇవ్వాలని కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.